క్లుప్తంగా

కేవీజీ సత్యనారాయణకు సన్మానం



సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ (కేవీజీజీ)ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నియమించారు. ఈ సందర్భంగా కేవీజీని మండల కేంద్రంలో పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ నాయకుడు బెవర మల్లేశ్వరరావు, రావివలస సర్పంచ్ వండాన కృష్ణ, పురుషోత్తపురం ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

వసప కేజీబీవీ ఎస్‌ఓపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని వసప కేజీబీవీ ప్రత్యేకాధికారిపై ఎంఈఓకు కుంటిభద్ర గ్రామానికి చెందిన విద్యార్థిని తండ్రి జి.నీలం నాయుడు సోమవారం ఫిర్యాదు చేశారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తన కుమార్తె చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమార్తెతోపాటు విద్యార్థులందరూ ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయం బయటపెడితే వేధిస్తారనే భయంతో ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. అన్నం, ఉప్మాలో పురుగులు ఉంటున్నాయని, బాగా పాడైపోయిన కూరగాయలు పెడతున్నట్లు విద్యార్థినులు చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఓ దృష్టికి తీసుకెళ్తే.. తనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు వాగ్వాదానికి దిగినట్లు నీలంనాయుడు పేర్కొన్నారు. గత నెలలో కేజీబీవీ నిర్వహణపై డీఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. విద్యార్థినులను ఎస్‌ఓతోపాటు సిబ్బంది వేధిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎస్‌ఓ, సిబ్బంది పనితీరు, భోజనాలపై దర్యాప్తు చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: పట్టణ శివారులోని తాళ్లవలస వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న 234 మంది విద్యార్థులకు ఆమదాలవలస, అక్కులపేటల సత్యసాయి సేవా సమితుల తరఫున దుస్తులు సమకూర్చారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, టీడీపీ నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అమరనాథ్, పాఠశాల ఎస్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆపత్రి వైద్యులు విధిగా సమయపాలన పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఆస్పత్రిలోనే ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. రోగుల ఆక్యుపెన్సీ పెంచాలని సూచించారు. 23 మంది వైద్యులు, వందకు పైగా సిబ్బంది ఉన్నా.. రోజూ ఓపీ 200లకు మించడం లేదన్నారు. నూతన అభివృద్ధి కమిటీ సభ్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు పరిచయం చేశారు. ఆస్పత్రి నిధులతో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. పెండింగ్ పనులు ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. వైద్యులతోపాటు ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ సంతోష్, అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ ఏపీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తం



బోరుభద్ర వద్ద పులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పాతపట్నం: మండలంలోని దాసుపురం సమీపంలో పులి కనిపించినట్లు అటవీశాఖ అధికారులకు సోమవారం సాయంత్రం గ్రామస్తులు సమాచారం అందజేశారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు చేరుకుని పంట పొలాల్లో పులి పాదముద్రలపై ఆరా తీశారు. ఎక్కడా పాదముద్రలు కనిపించకపోవడంతో పులి రాలేదని నిర్ధారించారు. సోమవారం ఉదయం చిరుజల్లులు పడుతున్నప్పటికీ బోరుభద్ర గ్రామ పంట పొలాల్లో రైతులతో కలిసి ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రల కోసం ఆరా తీశారు. ఎక్కడా పులి పాదముద్రలు కనిపించకపోవడంతో ఫారెస్ట్ అధికారులు వెనక్కి తిరిగి వచ్చేశారు. దాసుపురం, తిడ్డిమి, రంకిణి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

గడ్డిపరకే.. బంగారమాయే!





యంత్రంతో నూర్పిడి చేస్తున్న రైతులు

- యంత్రాలతో వరి కోత, నూర్పిడి
- మేతకు పనికిరాకుండా పోతున్న గడ్డి
- పశుగ్రాసం కొరతతో రైతుల అవస్థలు

సరుబుజ్జిలి: ఖరీఫ్ సీజన్‌లో వరి కోతలు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. రైతుకు ఆర్థికంగా భారం కాకూడదన్న ఆలోచనతో యంత్రాల ద్వారా వరి చేను నూర్పిడిలు చేపడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస, బూర్జ మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 26,787 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు.

అధిక శాతం యంత్రాలతో...

ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 70 శాతం వరి నూర్పుడి యంత్రాల ద్వారా చేశారు. కొంతమంది కుప్పలు కూర్చిన తదుపరి చిన్న యంత్రాలతో నూర్పిడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. పలు ప్రాంతాల్లో కొంతమంది రైతులు పెద్ద హార్వెస్టర్ ద్వారా వరికోతతోపాటు, నూర్పిడి కూడా చేపట్టారు. యంత్రాలతో నూర్పిడి చేపట్టడం వలన వరి గడ్డి చిందరవందరగా మారుతుంది. ఈ విధంగా మారిన గ్రాసం పశువులు మేతకు పనికిరావడంలేదు. దీని వలన పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది.

పశువులకు సగటున కావాల్సిన గ్రాసం వివరాలు..

సగటున పశువులకు ఎండి గడ్డి రోజుకు 10 కిలోలు, పచ్చగడ్డి 11 నుంచి 16 కిలోల వరకు అవసరమని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్కో జీవానికి నెలకు 400 కిలోల గడ్డి సేకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యంత్రాల ద్వారా నూర్పిడి చేయడం వలన పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. మిగిలిన 30 శాతం మంది సాధారణ పద్ధతుల్లో నూర్పిడి చేపట్టే సమయానికి ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ట్రాక్టర్ గడ్డిని రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం



పశుగ్రాసం కొరత రాకుండా ప్రత్యామ్నా చర్యలు కోసం గ్రామల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అజొల్లా, హైడ్రోకోనిక్, ఏక, బహు, వార్షిక పశుగ్రాసాల సేద్యంతోపాటు, పప్పు, జొన్న రకాల పోషక విలువలతో కూడిన దాణా సేద్యం, పెంపకం గురించి చెబుతున్నాం.

– సి.హెచ్.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్, పశుగణాభివృద్ధి శాఖ, సరుబుజ్జిలి

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



పశుగ్రాసం కొరత లేకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యల కోసం ప్రతీరోజు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. యంత్రాలతో వరి పంట నూర్పుడిలు చేపట్టినా.. పశుగ్రాసం పెంపకాలు చేపడుతున్నాం. దీనివలన గడ్డి కొరత కొంతమేర తీరుతుంది.

– జి.రాజారావు, పాడి రైతు, వెంకటాపురం, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలో వరి సాగు (హెక్టార్లలో), పశు సంపద వివరాలు ఇలా..

మండలం	సరుబుజ్జిలి	బూర్జ	ఆమదాలవలస	పొందూరు
వరి విస్తీర్ణం	5,200	6,230	7,234	8,123
పశుసంపద	12,500	13,600	12,100	19,630

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ

- విద్యుత్ చార్జీల పెంపుతో ఆర్థికభారం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచటంతో సామాన్య, మధ్య, పేద కుటుంబాలకు చెందిన వారిపై ఆర్థికభారం పడుతోందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని అనేక సభల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు మాట తప్పారన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన ఐదు నెలల పాలనలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఇప్పటికే రూ.1.27, ప్రస్తుతం రూ.0.92 (పైసలు) పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార దాహంతో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి ప్రజలను మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు పట్ల ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే.. తాను అలా మాట్లాడలేదని మాట మార్చుతున్నారన్నారు. సర్దుబాటు పేరుతో ప్రజల నుంచి నెలనెలా అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఉచిత గ్యాస్ కూడా అందరికీ అందటం లేదన్నారు. చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలు, మాయ మాటలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని వివరించారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు ఏర్పాట్లు

సరుబుజ్జిలి: ఈ నెల 8న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 10 సాగునీటి సంఘాల్లో 8 మేజర్, 2 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయని అధికారులు సోమవారం తెలిపారు. తెలికిపెంట, సరుబుజ్జిలి, కొత్తకోట, డకరవలస, సుభద్రాపురం, రొట్టవలస, యరగాం, పురుషోత్తపురం మేజర్ నీటి సంఘాలుగా, వెన్నెలవలస, తాడికొండ మైనర్ నీటి సంఘాలుగా ఏర్పాటు చేశారు. మేజర్ నీటి సంఘాల్లో 12 టీసీలు, మైనర్ నీటి సంఘాల్లో 6 టీసీలకు ఎన్నికలకు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ఎన్నికలు



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించటం జరుగుతుందని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాగునీటి ఎన్నికల నిర్వాహణకు సంబంధించి వంశధార ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశమయ్యారు. మండలంలో ఏడు నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సంఘాల్లో కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు రైతులు ఓట్లు వేస్తారన్నారు. పెద్దకోట, రావిచంద్రి, కృష్ణాపురం గ్రామాల్లోని మేజర్ సాగునీటి సంఘాలు, వెంకంపేట, గొట్టిపల్లి, యంబరాం, డొంకలబడవంజ గ్రామాల్లోని మైనర్ సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు చోటు చేసుకున్నట్లు రైతులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆర్ఐ ఎస్.గవరయ్య, వంశధార ఏఈలు టి.శ్రీనివాసరావు, ఎస్.దిలీప్‌కుమార్, వీఆర్వో సి.హెచ్.రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్డులపై సమాచారం లేదు

ఆమదాలవలస: కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ఉత్తర్వులు వెలువడ లేదని ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయ అధికారి ఎ.వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. డిసెంబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందనే విషయంపై కూడా ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎటువంటి ఆప్షన్ కూడా ఇవ్వలేదన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. యూట్యూబ్, వాట్సాప్‌లో వచ్చే పుకార్లను నమ్మవద్దన్నారు.

చినుకుపడితే చిత్తడే



చినుకు పడిందంటే నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలు బురదమయంగా తయారవుతున్నాయి. గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఆస్పత్రి ముందు భాగం చిత్తడిగా మారింది. వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారైంది. ఇది ఆస్పత్రి ఆవరణమా లేదా సంతా అని రోగులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి వర్గాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- నరసన్నపేట

రోడ్డుపై మురుగునీరు ప్రవాహం



ఎల్.ఎన్.పేట మండలంలోని కొమ్మువలసలో డ్రైనేజీ లేకపోవటంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవస్తోంది. ప్రధాన వీధిలో ఉంటున్న కుటుంబాల వారు ఇళ్లల్లో వాడిక నీరు, వర్షం నీరు వీధి మధ్యలో నిలిచిపోతుంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

అంతిమ సంస్కారాలకు అవస్థలు



సరుబుజ్జిలి మండలం చినకాగితాపల్లి పంచాయతీ బుడ్డివలసలో ఉన్న శ్మశాన వాటిక నిర్వహణ సక్రమంగా లేదు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతున్నారు. శ్మశాన వాటికకు సరైన నీటి సదుపాయం, ప్లాట్‌పాం లేకపోవడం వలన చెరువు గట్టుపై దహన క్రియలు చేస్తున్నారు.

- సరుబుజ్జిలి

ప్రజాధనం వృథా..



సారవకోట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న జనరేటర్ నిరుపయోగంగా పడి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ కార్యాలయానికి జనరేటర్ మంజూరు చేశారు. అప్పటినుంచి నేటివరకు ఒక్కసారి కూడా దీనిని వినియోగించిన దాఖలాలు లేవు.

-సారవకోట

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి



నరసన్నపేట: దుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీక మాసం పూర్తయిన సందర్భంగా సోమవారం పోలి పాడ్యమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. పలుచోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: సోమేశ్వర ఆలయంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న గ్రామస్తులు



కొత్తూరు: మెట్టూరు బిట్‌-1 ఆర్‌ఆర్ కాలనీలో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు



ఆమదాలవలస: వెంగళరావుకాలనీలో వస్త్రదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుడుమూరు శ్రీనివాసరావు

అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పొందూరు: మండలంలోని రాపాక గ్రామ రామాలయం వీధిలో శివస్వాముల మాలధారణ విరమణ సందర్భంగా సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, యాత్రికులు అన్నదానంలో పాల్గొన్నారు. నిరుపేదలకు వస్త్రదానం చేశారు. గురుస్వామి కొంచాడ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కలను సంరక్షించండి

నరసన్నపేట: మొక్కలను సంరక్షించాలని నరసన్నపేట ఫారెస్టు ఆఫీసర్ ఎస్.శ్రీనివసారావు అన్నారు. స్థానిక శ్రీరాంపాడు యాత్రా స్థలంలో వనసమారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అధికంగా చేరే ప్రాంతాలు, యాత్రా స్థలాలు, పిక్నిక్ ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను సమీప గ్రామస్తులు సంరక్షించాలని కోరారు. దూకులపాడు సర్పంచ్ అల్లు అసిరినాయుడు, అటవీశాఖ ప్రతినిధులు నరేంద్ర, వాసుదేవరావు, రాజేంద్ర, జనప్రియ, రంజిత్ కుమార్, ఎస్.వి.రమణ, విశ్వనాథం, కమిటీ సభ్యులు షన్ముఖరెడ్డి, శిమ్మ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పాతపట్నంలో కేజీబీవీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం, హిరమండలం మండల కేంద్రాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో రూ.1.43 కోట్లతో లైబ్రరీ, కంప్యూటర్ గదులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం పాతపట్నంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమగ్ర శిక్ష ఈఈ డి.వి.ఎస్.మూర్తి, డీఈఈ ఎస్.వెంకటరావు, జేఈ బుచ్చిబాబు, తహసీల్దార్లు కిరణ్‌కుమార్, హనుమంతరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓలు రాంబాబు, గోవిందరావు, తిరుమలరావు, ఎస్‌ఓలు సంతోషికుమారి, కృష్ణవేణి, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..



అన్నపూర్ణమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ మదనాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అడపా అన్నపూర్ణమ్మ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన నడిమెంటు రామ్మోహన్‌కు గుండె ఆపరేషన్ కావడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఉప సర్పంచ్ వి.అప్పలనాయుడు, సీనియర్ నాయకుడు జి.రాము, ఎస్.వెంకటరమణ, జి.జగన్, తదితరులు ఉన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎంపీడీఓ పావని

సరుబుజ్జిలి: బాలికల సంరక్షణ పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ ఎం.పావని సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల ఉద్యోగులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. బాలికల ఆరోగ్య రక్షణ, సైబర్ మోసాలు, బాల్య వివాహాల పట్ల అప్రమత్తం కావాలని బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత తెలిపారు. ఎంఈఓలు శ్రీనివాసరావు, బాలరాజు, వైద్యాధికారి జ్యోతిర్మయి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో జిల్లా వాసులు



అప్పన్నను అభినందిస్తున్న తెలుగు సంఘం ప్రతినిధులు



వెంకటరమణను సన్మానిస్తున్న నిర్వాహకులు

జలుమూరు/హిరమండలం: జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామానికి చెందిన డాక్టర్ అల్లు అప్పన్న, హిరమండలం మండలానికి చెందిన గురువిల్లి వెంకటరమణకు దుబాయ్‌లో అరుదైన గౌరవం దక్కింది. నాలుగు రోజులుగా దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొని ప్రసంగించినట్లు సోమవారం తెలిపారు. విద్యారంగంలో జరుగుతున్న గణనీయ మార్పులు, జీవన నైపుణ్యాలు, బాలల హక్కులు–బాధ్యతలు తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు అప్పన్న, వెంకటరమణ తెలిపారు. తమ అనుభవాలు, ఆలోచనలు పంచుకున్నట్లు చెప్పారు. వమరవల్లిలో ఉన్న జిల్లా విద్యా శిక్షణ(టీటీసీ) సంస్థలో మనోవిజ్ఞానశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. దుబాయ్ తెలుగు సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తదితరులు వీరిని అభినందించారు. తోటి అధ్యాపకులు, విద్యారంగ నిపుణులు, విద్యాశాఖ అధికారులు, ఆయా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.